# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ:  20-06-2025                    సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు విశాఖపట్నం చేరుకున్నారు.
- ❖ నూతన విద్యావిధానం ద్వారా దివ్యాంగ విద్యార్థులకు ఇతరులతో సమానంగా నాణ్యమైన విద్య లభిస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీహార్ రాష్ట్రంలో పలు బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను ఈరోజు ప్రారంభించారు.
- ❖ రైతుల నుండి వ్యవసాయ ఉత్పత్తుల సేకరణలో మధ్యవర్తుల ప్రమేయాన్ని తొలగించనున్నామని కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ఈరోజు సాయంత్రం విశాఖపట్నం చేరుకున్నారు. విశాఖలో ఆయనకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రధానమంత్రి ఈ రాత్రి తూర్పు నౌకాదళ ప్రాంగణంలోని చోళ అతిథి గృహంలో బస చేయనున్నారు. కాగా.. ప్రధానమంత్రి రేపు విశాఖ సాగరతీరంలో ఉదయం 6 గంటల 30 నిమిషాలకు ప్రారంభం కానున్న అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో పాల్గొంటారు.

=====================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు డెహ్రాడూన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. రాష్ట్రపతి నికేతన్, రాష్ట్రపతి తపోవన్ లను ప్రారంభించారు. 132 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్న రాష్ట్రపతి ఉద్యాన్ అనే ఉద్యానవనానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఇది ఒక సంవత్సర కాలంలో నిర్మాణం పూర్తయ్యి, ప్రజలకు అంకితం చేయబడనుంది. ఈ నెల 24 నుండి రాష్ట్రపతి నికేతన్, రాష్ట్రపతి తపోవన్ లు ప్రజలకు అందుబాటులోకి

రానున్నాయి. అనంతరం రాష్ట్రపతి.. అక్కడి అంధుల పాఠశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే పలువురు అంధ విద్యార్థులు గీతాలు ఆలపించి రాష్ట్రపతికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. అన్ని రంగాల్లోనూ దివ్యాంగులను ప్రోత్సహించడం ఆవశ్యకమని అన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాల సహాయంతో, దివ్యాంగులు ఇప్పుడు ప్రధాన స్రవంతికి దోహదపడతారని పేర్కొన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రశంసిస్తూ... ఈ విధానం ఇతర పిల్లలతో సమానంగా వికలాంగులైన చిన్నారులు నాణ్యమైన విద్యను పొందేలా చేస్తుందని ఆమె ఆమె పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీహార్‌లోని సివాన్‌లో 5 వేల 900 కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను ఈరోజు ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులలో పట్టణాభివృద్ధి, మురుగునీటి శుద్ధి, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, రైల్వేలు, విద్యుత్ రంగాలకు సంబంధించినవి ఉన్నాయి. బీహార్ - ఉత్తరప్రదేశ్‌లను కలిపే 400 కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో నిర్మించిన నూతన వైశాలి - డియోరియా రైల్వే లైన్ ప్రాజెక్టును ప్రధానమంత్రి జాతికి అంకితం చేశారు. అనంతరం సివాన్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో బీహార్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. భారత్.. ప్రపంచంలో మూడవ సూపర్ పవర్‌గా ఎదగడానికి బీహార్ రాష్ట్రం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

బీహార్ పర్యటన అనంతరం ప్రధానమంత్రి ఒడిశాకు ప్రయాణమయ్యారు. ఒడిశాలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటయ్యి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభా కార్యక్రమానికి ప్రధానమంత్రి హాజరయ్యారు. ఈ పర్యటనలో భాగంగా 18 వేల 600 కోట్ల రూపాయలకు పైగా విలువైన ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. అంతకుముందు భువనేశ్వర్ విమానాశ్రయంలో ప్రధానమంత్రికి ఆ రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, తదితరులు ఘన స్వాగతం పలికారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్  కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

విరామం

=====================

రైతుల నుండి వ్యవసాయ ఉత్పత్తులను ప్రత్యక్షంగా సేకరించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని కేంద్ర హోం, సహకార శాఖా మంత్రి అమిత్ షా తెలిపారు.  ఈరోజు అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా ముంబైలో జరిగిన జాతీయ సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పత్తి ప్రక్రియ నుండి మధ్యవర్తులను తొలగిస్తామని పేర్కొన్నారు. ఈ చర్య ద్వారా రైతులు వ్యవసాయ ఉత్పత్తులకు న్యాయమైన ధరలు పొందడానికి అవకాశం లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సహకార నమూనా ఆధారంగా ప్రభుత్వం త్వరలో ఒక బీమా కంపెనీని ప్రారంభిస్తుందని, దేశవ్యాప్తంగా 2 లక్షల నూతన ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాలు స్థాపించనున్నట్టు చెప్పారు. రానున్న 10 సంవత్సరాల్లో ఎగుమతులు, సేంద్రీయ ఆహారం, విత్తనాలు ఈ మూడు కీలక రంగాలలో సహకార సంస్థలు ఉద్భవిస్తాయని, ఇవి రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో సహకారాన్ని అందిస్తాయని అమిత్ షా తెలుపుతూ...

(వాయిస్ 27 సెకన్లు)

=====================

రష్యా పర్యటనలో ఉన్న కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అక్కడ జరుగుతున్న సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరం సందర్భంగా సౌదీ అరేబియా రవాణా, లాజిస్టిక్స్ సేవల మంత్రి సలేహ్ అల్జాసర్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెండు దేశాలలోని మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ఈ ప్రాంతంలోని రవాణా, లాజిస్టిక్స్ కారిడార్లపై ఇరువురు అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నారు. రైల్వేలు, లాజిస్టిక్స్‌తో సహా ద్వైపాక్షిక సహకారం కోసం భవిష్యత్ ప్రాజెక్టులపై ఇరువురు నేతలు చర్చలు జరిపారు. పర్యటనలో భాగంగా రైల్వే మంత్రి, రష్యన్ రైల్వేస్ CEO ఒలేగ్ బెలో జెరోవ్, ఆయన సీనియర్ మేనేజ్‌మెంట్ బృందంతో కూడా సమావేశం నిర్వహించారు. హై - స్పీడ్ రైళ్ల అంశంతో పాటు రెండు దేశాల రైల్వే రంగంలోని వివిధ వ్యవస్థలలో నూతన ప్రాజెక్టులు, సాంకేతిక ఆవిష్కరణలపై చర్చించారు.

=====================

అంతర్జాతీ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖలో 25 వేల మంది విద్యార్థులతో ఈరోజు నిర్వహించిన సూర్య నమస్కారాల కార్యక్రమానికి కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 25 వేల మంది గిరిజన విద్యార్థులు 108 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలను చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన విద్యార్థులు చేపట్టిన ఈ బృహత్ కార్యక్రమం ప్రపంచ రికార్డును నెలకొల్పనుంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... విశాఖలో 5 లక్షల మందితో యోగా దినోత్సవాన్ని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అలాగే 25 వేల మంది గిరిజన విద్యార్థులతో యోగా కార్యక్రమం చేపట్టడం అద్భుతమని వ్యాఖ్యానించారు.

=====================
=====================